క్లుప్తంగా

ఎమ్మార్సీకి చేరిన నోట్ బుక్స్

తాండూరు రూరల్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎమ్మార్సీకి నోట్ పుస్తకాలు వచ్చాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ యేడాది నుంచి ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తోంది. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు బుక్స్ ఇవ్వనున్నారు. అందులో భాగంగా తాండూరు పట్టణం, మండలం కలిపి యూపీఎస్ పాఠశాలు 15, ఉన్నత పాఠశాలు 10 ఉన్నాయి. అలాగే ఒకటో తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థుల కోసం వర్క్ బుక్‌లు కూడా వచ్చినట్లు సీఆర్‌పీ సుభాష్, ఐఈ ఆర్‌టీ విద్యాధర్ తెలిపారు. ఎంఈఓ ఆదేశాలతో త్వరలో పాఠశాలలకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

టీకా ఇప్పించకపోతే నష్టం

మోమిన్‌పేట: పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు రైతులు వేయించాలని మండల పశు వైద్యాధికారి గీత కోరారు. గురువారం టేకులపల్లి, ఇబ్రాచిట్టంపల్లిలో రెండు బృందాలుగా ఏర్పడి 440 పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి సోకక ముందే టీకా ఇప్పించాలని సూచించారు. వ్యాధి సోకితే పశువుల కాళ్లల్లో పుండ్లు ఏర్పడి, జ్వరం వచ్చి మేత తినడం మానేస్తాయని చెప్పారు. దీంతో పశువు బక్కచిక్కి పోతుందని ఆమె పేర్కొన్నారు. ఆవులు, బర్రెలు పాలు ఇవ్వడం మానేస్తాయన్నారు. తద్వారా రైతులకు తీవ్ర నష్టం వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచితంగా వేస్తున్న నివారణ టీకాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ



సీఐకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఐ

మోమిన్‌పేట: మోమిన్‌పేట సీఐగా ఆంజనేయులు గురువారం బాధ్యతలు చేపట్టారు. నెల క్రితం వికారాబాదు సీసీఎస్‌లో పని చేసిన ఆయన.. రాచకొండ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు. మోమిన్‌పేటకు సంగారెడ్డి రూరల్ సీఐగా పనిచేసిన శివలింగయ్య బదిలీపై రాగా.. నెల రోజులకు తిరిగి సంగారెడ్డికి వెళ్లారు. రాచకొండ కమిషనరేటుకు వెళ్లిన ఆంజనేయులు తిరిగి సీఐగా ఇక్కడి వచ్చారు. ఈ మేరకు ఎస్ఐ విఠల్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గుంతల రోడ్లతో జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

దౌల్తాబాద్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్ఐ రమేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచి గుంతలు కనబడవని, అలాంటి రోడ్లలో జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ దాసు, సిబ్బంది రఘుగౌడ్, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

ధారూరుకు 108 వాహనం



108 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: ధారూరు మండలానికి ఎట్టకేలకు 108 వాహనం కేటాయించారు. జిల్లాలో అతి పెద్ద మండలముగా ఉన్న ధారూరుకు 108 వాహనం అందుబాటులో లేక.. అత్యవసర సమయాల్లో ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని, ఇప్పటికైనా 108 వాహనం మండలానికి రావడం సంతోషంగా ఉందని పలువురు చెప్పారు. గురువారం ఎమ్మెల్యే ఆనంద్, స్థానిక సర్పంచ్ ఉప్పు చంద్రమౌళితో కలిసి 108 వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ అవుసుపల్లి అంజయ్య, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక దృష్టి

దోమ: గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామని సర్పంచ్ అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం దోమ మండలం దొంగ ఎన్కేపల్లిలో వీధుల్లో గడ్డి మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలోని అన్ని వీధులలో మురుగు కాలువలు, రోడ్లను పరిశుభ్రంగా ఉంచుతున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులను కోరారు.



మోమిన్‌పేట: కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అంజిరెడ్డి తదితరులు



అనంతగిరి: కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అన్నదాతల మోముల్లో ఆనందం

రెండోసారి రైతు రుణమాఫీని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో పాటు, ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో జిల్లాలో అన్నదాతల మోముల్లో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కర్షకుల కష్టాలు తెలిసిన కేసీఆర్ కొనియాడారు. బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీట్లు పంచుకొని సంబురాలు జరుపుకొన్నారు.

- రుణమాఫీ ప్రకటనతో హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు
- సంబురాలు జరుపుకొన్న గులాబీ శ్రేణులు
- ఊరూరా సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

మోమిన్‌పేట: తెలంగాణ రైతులకు రుణమాఫీ చేసి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బాంధవుడు అయ్యాడని డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని డీసీసీబీ బ్యాంకు వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు ప్రాజెక్టుల నిర్మాణం, రైతుబంధు, బీమా, పంటలను మద్దతు ధరలకు ప్రభుత్వమే కొనుగోలు



తాండూరు రూరల్: సంగెంకలాన్‌లో..

చేయడం, రుణమాఫీ చేయడం వలన తెలంగాణ రాష్ట్రం.. దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.

హర్షణీయం..

యాలాల: రైతు పక్షపాతి సీఎం కేసీఆర్ అని, రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటున్న గొప్ప ప్రభుత్వమని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా కొనియాడారు. మండల కేంద్రంలోని రైతు వేదిక ఎదుట సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, నాయకులు యాదప్ప, బషీర్ ఉన్నారు.

కర్షకుల కష్టాలు తెలిసిన సీఎం

తాండూరు రూరల్: రైతు పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీఆర్‌ఎస్ సంగెంకలాన్ గ్రామ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ ప్రకటన నేపథ్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. రైతుల కష్టాలు తెలిసిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. బీఆర్‌ఎస్ బీసీసెల్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, తిరుమలేష్, ప్రభాకర్, రవి, రాజు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి సీఎం కృషి

దోమ: రైతుల అభ్యుతన్నతికి సీఎం కేసీఆర్ విశేశ కృషి చేస్తున్నారని వైస్ ఎంపీపీ మల్లేశం, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు బొంపల్లి గ్రామంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినెటర్ లక్ష్మయ్య ముదిరాజ్, కోఆప్షన్ సభ్యుడు ఖాజపాష, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, మాజీ ఎంపీపీ రాజగోపాల చారీ, బొంపల్లి ఎంపీటీసీ రాములు, ఉపసర్పంచ్ రఫిక్ పాష, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ భింసేన్, మాజీ చైర్మన్ గొల్ల శ్రీనివాస్, పార్టీ నేతలు షఫి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు మరోసారి రుణమాఫీ ప్రకటించడంతో కర్షకులు, బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ మండల నాయకులు, రైతుసంఘం నాయకులు మహేందర్‌రెడ్డి, శేరినారాయణరెడ్డి మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ కోసం సీఎం శ్రమిస్తున్నారని చెప్పారు.

తెలంగాణలో పెరిగిన సాగు

పరిగి: సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ ప్రకటనతో.. అన్నదాతలతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేసిందని చెప్పారు. రుణమాఫీతో రైతులకు రుణభారం తగ్గుతుందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగు కంటే ప్రత్యేక రాష్ట్రంలో సాగు ఎక్కువైందని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. ఎంపీపీ అరవింద్‌రావు,



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు. చిత్రంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కృష్ణ, రవిందర్ పాల్గొన్నారు.



యాలాల: సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ తదితరులు



బంట్వారం: కోటపల్లిలో..



కొడంగల్‌లో..



పెద్దేముల్: మంబాపూర్‌లో..



దోమలో.. బీఆర్‌ఎస్ నేతలు



బొంరాస్‌పేట: దుద్యాల మండల కేంద్రంలో

నివారణ మాత్రలతో నులిమేద్దాం



నులిపురుగు మాత్రలు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

బొంరాస్‌పేట: ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న నులిపురుగు నివారణ మాత్రలతో వాటిని నిర్మూలించి, హాయిగా జీవిద్దామని మండల మాజీ వైస్‌ఎంపీపీ శేరినారాయణరెడ్డి అన్నారు. గురువారం చౌదర్‌పల్లి తదితర పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు మాత్రలను వేయించి తగిన జాగ్రత్తలు సూచించారు. నులిపురుగులు ఉన్నవారు రక్తహీనత, అనారోగ్యంతో బాధపడుతుంటారని తెలిపారు. చేతుల అపరిశుభ్రత ప్రధాన కారణమన్నారు.

కుల్కచర్లలో

కుల్కచర్ల: చిన్నారుల్లో తరచూ సంభవించే రక్తహీనత నిర్మూలనకు నులిపురుగు నివారణ మాత్రలు తప్పనిసరని, ఇందుకోసం ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయించాలని మండల వైద్యాధికారి వాజిహుద్దీన్, మాధురి అన్నారు. నులిపురుగు నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఆయా పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ నెల 10వ తేదీ వరకు ప్రతి విద్యార్థికి నులిపురుగు నివారణ మాత్రలు వేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రప్రకాశ్, ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఏఎన్‌ఎం సుజాత, జంగమ్మ, ఆశ వర్కర్లు సునీత, స్వరూప, లావణ్య, అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సోమన్‌గుర్తిని సందర్శించిన కేంద్ర బృందం



వివరాలు సేకరిస్తున్న బృందం సభ్యురాలు

పూడూరు: పూడూరు మండలం సోమన్‌గుర్తి గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గురువారం ఎస్‌హెచ్‌జీ కేంద్ర బృందం సభ్యురాలు గుహాంబికా పరిశీలించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా చేసిన డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, పల్లె పకృతి వనం, నర్సరీతో పాటు పలు అభివృద్ధి పనులను పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. డీఆర్‌డీఏ డీపీఎం వీరయ్య, ఎంపీడీఓ ఉమాదేవి, ఎంపీఓ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

పరిగి: భారీ వర్షాలకు తెలంగాణలో రైతులు, ప్రజలు నష్టపోయారని, వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య కోరారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో వరద బాధితులకు సహాయ నిధి సేకరణ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వరద సాయం రూ.500 కోట్లు ఏమాత్రం సరిపోవని, ఇళ్లు పాడైన వారు ఎందరో రోడ్లపై ఉన్నారని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50వేల చొప్పుల పరిహారం ప్రకటించాలని కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో వరద బాధితులకు తమ వంతుగా సాయం చేయాలని విరాళాలు సేకరిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో గోపాల్, హబీబ్, సత్తయ్య, రఘురాం, కృష్ణ, రాంచెంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



వరద సాయం సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కార్మికులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ

పరిగి: భవన కార్మికుల కోసం ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ రాజేందర్ అన్నారు. గురువారం పరిగి మండలం నస్కల్ గ్రామంలో జన్‌సాహస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో రెండో విడత శిక్షణా తరగతులను ప్రారంభించి మాట్లాడారు. లేబర్ కార్డు ఉన్న వారికి 15రోజుల పాటు ఉచితంగా శిక్షణ నిర్వహిస్తున్నారని, శిక్షణ తీసుకుంటున్న కార్మికులకు మధ్యాహ్నం ఉచితంగా భోజనం, రోజుకు రూ.300 చొప్పుల స్కాలర్‌షిప్ అందిస్తున్నారని పేర్కొన్నారు.

నందనవనంగా మారుస్తా

మునుపటికంటే మెరుగైన సేవలకు కృషి

పౌర సేవల విషయంలో ఉమ్మడి జిల్లాలోనే తొలి రికార్డు సృష్టించిన తాండూరు మున్సిపాలిటీ.. ప్రస్తుతం వెనుకబడింది. నిన్నమొన్నటి వరకు కురిసిన వానలతో పుర పరిధిలో పారిశుద్ధ్య పనులు పడకేసి, వీధుల్లో చెత్తకుప్పలు, మురుగు కాలువలు ముందుకు సాగని దుస్థితి ఏర్పడింది. అసలే సీజనల్ వ్యాధుల కాలం.. ఆపై ఇలా పారిశుద్ధ్యం లోపించడం, దోమలు, ఈగల బెడద పెరిగి జనాలు జంకుతున్న నేపథ్యంలో.. మున్సిపల్ కమిషనర్ షఫివుల్లాతో 'సాక్షి' ముఖాముఖి.

- పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ
- తాండూరు మున్సిపల్ కమిషనర్ షఫివుల్లా



మున్సిపల్ కమిషనర్ షఫివుల్లా

తాండూరు: వర్షాలు తగ్గుముఖం పట్టాయి. కానీ మున్సిపాలిటీలో సమస్యలు తిష్ట వేశాయి. పారిశుద్ధ్యం లోపించి దోమలు, ఈగలు పెరిగాయి. ప్రజలు భయపడుతున్నారు. కీటకాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: ప్రజారోగ్యమే లక్ష్యంగా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాను. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాము. తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు లీకేజీలను అరికడుతున్నాము. దోమల నివారణకు వార్డుల్లో ఫాగింగ్ యంత్రాల ద్వారా మందు పిచికారీ చేయిస్తున్నాం.

ప్రశ్న: పారిశుద్ధ్య పనుల్లో ఎంతమంది కార్మికులు పని చేస్తున్నారు. చెత్త తరలింపునకు ఎన్ని వాహనాలు అందుబాటులో ఉన్నాయి?

జవాబు: మున్సిపాలిటీ పరిధి పారిశుద్ధ్య నిర్వహణలో 208 మంది నిరంతరం పనిచేస్తున్నారు. షిఫ్టుల వారీగా 36 వార్డుల్లో పనులు చేయిస్తున్నాము. 18 ఆటోలు, 8 ట్రాక్టర్ల ద్వారా చెత్త తరలిస్తున్నాము.

ప్రశ్న: ప్రధాన కూడళ్లలో చెత్త సేకరణకు గతేడాది చెత్తకుండీలు ఏర్పాటు చేశారు. నిర్వహణ సరిగా అవి అస్తవ్యస్తంగా ఉన్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి.

జవాబు: చెత్త బుట్టలు అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తన దృష్టికి రాలేదు. కమిషనర్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. పూర్తి స్థాయిలో పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకుంటాను.

ప్రశ్న: చెత్త వాహనాలు సగానికి పైగా మరమ్మతులకు గురయినట్లు సమాచారం. నిజమేనా?

జవాబు: పారిశుద్ధ్య పనుల కోసం వినియోగించే 10 ఆటోలు గతంలో మరమ్మతులకు గురైన విషయం వాస్తవమే. వాటిని రిపేర్ చేయించడానికి సోమవారం కౌన్సిల్ సభ్యుల ఆమోదం తీసుకోవడం జరిగింది. వారం రోజుల వ్యవధిలో వాహనాలను మరమ్మతు చేయించి.. వినియోగంలోకి తెస్తాం.

ప్రశ్న: మున్సిపాలిటీ వార్డుల్లో మురుగు కాల్వలు నిర్మించకుండానే కొత్తగా సీసీరోడ్లు నిర్మించారు. దీంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నీరు బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. ఫలితంగా కాలనీల్లో దుర్వాసన వస్తోందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నారు. వాటి గురించి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: ఆ అభివృద్ధి పనులు ఏ బడ్జెట్ ద్వారా జరుగుతున్నాయనేది తనకు అవగాహన లేదు. సీసీరోడ్లు వేయడం వలన మురుగు జలాలు ఎక్కడ నిలుస్తున్నాయో గుర్తించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతా.

ప్రశ్న: తాండూరు పట్టణ శివారులోని డంపింగ్ యార్డు నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి ఇక్కట్లను ఎలా తొలగిస్తారు? రానున్న రోజుల్లో ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: మున్సిపాలిటీ నిర్వహణ సరిగా లేకపోవడం కారణంగానే.. డంపింగ్ యార్డు పనులపై శ్రద్ధ చూపించలేకపోయారు. గతంలో డంపింగ్ యార్డు నందనవనంగా ఉందనే విషయం తెలిసిందే. రాబోయే రోజుల్లో పరిసర ప్రాంత ప్రజల ఇక్కట్లను తొలగించడంతో పాటు.. డంపింగ్ యార్డు చెత్తతో ఆదాయం సమకూర్చుకునే విధంగా కృషి చేస్తా.

ప్రశ్న: మున్సిపాలిటీలో పార్కులు ఉన్నా.. ప్రజలు సేద తీరేందుకు అనువుగా లేవు. పిల్లలు ఆడుకోవాలన్నా సరైన పరికరాలు అందుబాటులో లేవు. వీటిని ఎలా తీర్చిదిద్దుతారు? పౌర సేవల విషయంలో వెనుకబాటుకు గురైందనే విమర్శలు వస్తున్నాయి. దీన్ని ఎలా అదిగమిస్తారు?

జవాబు: పార్కులను పచ్చదనంగా మార్చేలా చర్యలు చేపడతా. ఇప్పటి వరకు మున్సిపాలిటీ ఎలా ఉండేదో కానీ.. ఇక మీదట తగిన మౌలిక సదుపాయాలు కల్పించి, ఆహ్లాదంగా మారుస్తాను. మునపటి కంటే మెరుగైన సేవలు అందించేందుకు చొరవ తీసుకుంటా..

ప్రశ్న: మున్సిపాలిటీలో ఎన్ని వార్డులు ఉన్నాయి. జనాభా ఎంత?

జవాబు: పురపాలికలో 36 వార్డులు ఉన్నాయి. సుమారు 75 వేల మంది జనాభా ఉంది.

విద్యార్థుల భవితకు 'తొలిమెట్టు'



యాలాల: ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మురహరినాథ్



బొంరాస్‌పేట: శిక్షణ తరగతులను పర్యవేక్షిస్తున్న విశ్వనాథ్‌గుప్తా

- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దోహదపడనున్న 'శిక్షణ' కార్యక్రమం: విద్యాధికారులు

యాలాల: విద్యార్థుల బంగారు భవితకు 'తొలిమెట్టు' ఎంతగానో ఉపయోగపడుతుందని తెలుగు సబ్జెక్టు జిల్లా రిసోర్స్ పర్సన్ మురహరినాథ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు విద్యాశాఖ వినూత్నంగా ఆలోచించడం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, ఆర్పీలు లీలావతి, శ్రీనివాస్ ఉన్నారు.

వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి

దౌల్తాబాద్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారిలో చదువుపై ఆసక్తిని పెంపొందిస్తూ విద్యలో రాణించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం తొలిమెట్టు. ఇందులో భాగంగానే గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫౌండేషనల్ లిటరరీ అండ్ న్యూమరరీ (ఎఫ్ఎల్ఎన్) బోధన పద్ధతులపై ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. తెలుగు, గణితం, ఆంగ్లం ఒక్కో సబ్జెక్టుపై రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య తదితరులున్నారు.

పకడ్బందీగా బోధనభ్యాసం..

బొంరాస్‌పేట: విద్యార్థులకు బోధన పకడ్బందీగా సాగాలని రాష్ట్ర పరిశీలకులు విశ్వనాథ్‌గుప్తా అన్నారు. ఈ నెల 2నుంచి 8వరకు జరిగే ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్, లిటరసి అండ్ న్యూమరసి) శిక్షణా తరగతులు రెండోరోజు బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు నిర్వహించగా.. విశ్వనాథ్‌గుప్తా, ఎంఈఓ రాంరెడ్డి పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు. టీచర్ల కొరత, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయుల అభిప్రాయాలు తీసుకున్నారు. మల్టీగ్రేడ్ (అన్ని తరగతులు) మల్టీ లేవల్ (తరగతిలోని గ్రేడు విద్యార్థులు) సూచనలు ఇచ్చారు. ఇందులో సీఆర్‌పీలు సోమ్లా, శంకరయ్య, ఎమ్మార్సీ సిబ్బంది గౌసుద్దీన్, దుద్యాల మండలంలో సీఆర్‌పీ రాందాస్ పాల్గొన్నారు. మూడోరోజు శుక్రవారం ఆంగ్లంపై శిక్షణ ఉంటుందన్నారు.

గుణాత్మకంగా..

పాఠశాలల్లో బోధన గుణాత్మకంగా సాగాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ (ఎస్ఆర్పీ) వీరేశం అన్నారు. బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం మండల పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. తరగతుల వారీగా ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల అభ్యసనాలను పరిశీలించారు. మరింత మెరుగుపడాలన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు తప్పని సరి

మర్పల్లి: పత్తి సాగులో రైతులు తప్పని సరిగా యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ వసంత అన్నారు. గురువారం గుండ్లమర్పల్లి గ్రామంలో పత్తి పంటను పరిశీలించి మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరి, పంటలు ఎరుపు రంగుగా మారాయని, అందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవచ్చని సూచించారు. పొలాల్లో నీరు నిలువ ఉండకుండా బోదెలు తీయాలన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగు ఎక్కువగా ఉంటుందని, పంటను కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారులు సూచించిన మందులు పంటపై పిచికారీ చేయాలన్నారు. కలుపు మొక్కలు ఉండకుండా చూడాలని, పత్తి దంట్లకు మట్టి ఎక్కే విధంగా గుంటుకలను కొట్టాలన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

బావులు, బోర్లు కలిగి ఉండి, ఆయిల్ ఫామ్ పంట సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్, డ్రిప్ సౌకర్యం కొరకు సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనుందని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఏఈఓలను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు.